## క్లుప్తంగా

### ఇందిరమ్మ ఇళ్ల సర్వే



**పాన్‌గల్:** మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుందని ఎంపీడీఓ గోవింద్‌రావు ఆదివారం పేర్కొన్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో సర్వే కొనసాగుతుందని, ప్రజా పాలనలో వచ్చిన 13,540 దరఖాస్తుల ఆధారంగా సర్వే చేస్తున్నామని, ఇప్పటి వరకు 49 శాతం పూర్తైనట్లు ఆయన పేర్కొన్నారు.

### 31న ఉచిత వైద్య శిబిరం

**అమరచింత:** మండల కేంద్రంలో ఈనెల 31న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంఆర్ఎం ట్రస్టు సభ్యులు సౌజన్యారెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గుండెకు సంబంధించిన ఉచిత వైద్య చికిత్స శిబిరాన్ని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణయ్ నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలతో పాటు ఫ్లెక్సీని విడుదల చేశారు. మండలంలోని గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సౌజన్యరెడ్డి, డాక్టర్ కమలాకర్‌రెడ్డి, సుధాంష్‌రెడ్డి, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

### శిథిలావస్థలో పశువుల ఆస్పత్రి భవనం



**వనపర్తి రూరల్:** మండలంలోని కడుకుంట్లలో పశువుల ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో గోడలు బీటలు వారి పూర్తిగా కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. దీంతో ఆస్పత్రిలో పని చేసే అటెండర్ సత్యం ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నానని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆస్పత్రిని వేరే భవనంలోకి మార్చాలని పశు పోషకులు, ప్రజలు కోరుతున్నారు.

### స్పీడ్ బ్రేకర్లు వేయించండి



**వీపనగండ్ల:** ప్రమాదకరంగా ఉన్న మలుపుతో ప్రమాదం పొంచి ఉందని సంపత్‌రావుపల్లి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో ప్రమాదకర మలుపు ఉండడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని అధికారులకు విన్నవించినా స్పందించ లేదని వాపోయారు.

# దరఖాస్తులు బోలెడు..

- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే
- లబ్ధిదారులు ఎందరో!
- ఇందిరమ్మ కమిటీల ఆమోదంతోనే ఇళ్లు మంజూరు

**పాన్‌గల్:** ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు కోసం అర్హులను గుర్తించేందుకు మండలంలోని 28 పంచాయతీల్లో అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా పేదలకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మూడు విడతలుగా రూ.5 లక్షలు అందించనుంది. ఈ నేపథ్యంలో ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా అర్హులను గుర్తించనున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి ప్రత్యేక ఐడీ సంఖ్యను ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వం తయారు చేసిన ఇంటి నమూనా ప్రకారమే లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాల్సి ఉంటుందని, కనీసం 400చదరపు అడుగుల స్థలం ఉండాలన్నారు. సర్వే వివరాలు ఈనెల 9వ తేదీ నుంచి గ్రామాల్లో కొనసాగుతున్నా ఇప్పటి వరకు 50 శాతం కూడా చేరుకోలేదు. అధికారులు సర్వే కోసం దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లిన సమయంలో వారు లేకపోవడం, సర్వర్ సమస్యతో కొంత జాప్యం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

**మండలానికో నమూనా ఇల్లు**

ఇందిరమ్మ నమూనా ఇంటిని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నిర్మించనున్నారు. ఇంటి నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించి, ముగ్గు పోశారు. అర్హులను ఎంపిక చేసేందుకు జరుగుతున్న సర్వేలో దరఖాస్తుదారుడి వివరాలు, ఇంటి స్థలం వివరాలను ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో పొందుపరుస్తున్నారు.



ఇందిరమ్మ ఇల్లు నమూనా

**మార్పు చేర్పులకు అవకాశం కరువు**

ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం అందిస్తున్న తరుణంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారికి నేటి వరకు కూడా మళ్లీ అవకాశం కల్పించలేదు. అదేవిధంగా దరఖాస్తు సమయంలో తప్పులు చేసినా.. నివాసం ఓ చోట ఉండి, ఇంటి స్థలం మరో చోట ఉన్న వారికి కూడా అవకాశం కల్పించాల్సి ఉంది. కానీ చేర్పులు, మార్పులకు అవకాశం లేకపోవడంతో ఎంతో మంది ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హతను కోల్పోయే అవకాశం ఉంది. సర్వే అనంతరం వచ్చిన జాబితాను ఇందిరమ్మ కమిటీలకు అందజేస్తారు. కమిటీ సభ్యులు జాబితాలోని పేర్లను పరిశీలించి వారు అర్హులో కాదో నిర్ణయిస్తారు. కమిటీ ఆమోదం తర్వాతే అర్హుడికి ఇల్లు మంజూరు చేస్తారు.



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నమూనా ఇంటి నిర్మాణానికి కేటాయించిన స్థలం

**మండలాల వారీగా..**

| మండలం | దరఖాస్తులు | సర్వే చేసినవి | శాతం |
|---|---|---|---|
| పాన్‌గల్ | 13540 | 5145 | 38 |
| చిన్నంబావి | 7997 | 3278 | 41 |
| వీపనగండ్ల | 7592 | 2271 | 30 |

**పేదలకు మొదటి ప్రాధాన్యం**



ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్లను ముందుగా ఇల్లు లేని పేదవారికి మొదటగా అవకాశం కల్పించాలి. ఎన్నో ఏళ్లుగా ఇళ్ల కోసం పేదవారు ఎదురుచూస్తున్నారు. వారిని దృష్టిలో ఉంచుకొని పైరవీలు, సిఫార్సులకు తావులేకుండా అర్హులైన పేదవారికి మొదటగా అవకాశం కల్పిస్తే వారికి మేలు జరుగుతుంది.

– మంగ్యా, తెల్లరాళ్లపల్లితండా

**దరఖాస్తు చేసుకోని వారికి..**



ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోని వారికి అవకాశం కల్పిస్తే వారు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటారు. చాలా మంది అర్హులు దరఖాస్తులు చేసుకోలేదు వారిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అవకాశం కల్పించాలి. సర్వేలో నిజమైన అర్హులను గుర్తించి వారికి అవకాశం కల్పించాలి.

– సూర్యవంశ రాము, సీఐటీయూ నాయకుడు

**ప్రభుత్వం ఆప్షన్ ఇవ్వాలి**



ఇందిరమ్మ ఇళ్ల కోసం కొత్త వారిని ఎంపిక చేసేందుకు, మార్పులు చేసేందుకు ప్రభుత్వం ఆప్షన్ ఇవ్వాలి. ఆప్షన్ రాగానే కొత్త దరఖాస్తులు స్వీకరిస్తాం. ఇందిరమ్మ ఇళ్ల నమూనా ఇంటి నిర్మాణం కోసం స్థలం కేటాయింపు పూర్తయింది.

– గోవింద్‌రావు, ఎంపీడీఓ, పాన్‌గల్

# యాసంగి సాగులో రైతులు బిజీబిజీ



పాన్‌గల్‌లో సిద్ధంగా ఉన్న నారుమడి

**పాన్‌గల్:** మండలంలోని వివిధ గ్రామాల్లో వానాకాలం పంట నూర్పిడి, ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావడంతో రైతులు యాసంగి సాగులో భాగంగా వరి నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేయడంలో బిజీబిజీగా ఉన్నారు. వానాకాలంలో మండలంలో ఆశించిన దానికంటే ఎక్కువగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరగడం, పంటల సాగుకు ఆధారమైన కేఎల్‌ఐ, బీమా కాల్వల ద్వారా సాగునీరు వస్తుందని, దీంతో పాటు బోర్లు, చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో యాసంగిలో 10,500 ఎకరాల్లో వరి సాగు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ ఇస్తుండటంతో రైతులు వాటి సాగుకే మొగ్గుచూపుతున్నారు. సాగుకు అనుగుణంగా ఎరువులను అందుబాటులో ఉంచాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. సాగులో ఏమైనా ఇబ్బందులు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.



కరిగెట చేస్తున్న రైతు

# సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓకు వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**పాన్‌గల్:** మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీడీఓ గోవింద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్ మాట్లాడుతూ.. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో అనేక సమస్యలతో ప్రజలు, రైతులు, కూలీలు, నిరుద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీపీలకు సరైన నిధులు లేకపోవడం, జీపీ కార్మికుల వేతనాలు నెలనెలా అందకపోవడంతో ప్రత్యేక వారు కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు అందించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలను చైతన్యం చేసి వారితో కలిసి పోరాటాలు కొనసాగిస్తామన్నారు.

# నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

**వనపర్తి టౌన్:** ఆర్టీసీ పదవీ విరమణ ఉద్యోగుల సంఘం 2025 నూతన సంవత్సర డైరీని ఆదివారం తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో గౌరవ అధ్యక్షుడు వాకిటి శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.సత్యన్నచారి మాట్లాడుతూ నాటి పరిస్థితుల్లో రెగ్యులర్ ఎంప్లాయిస్ వారికి యూనియన్ అంటూ లేకుండా పోయిందని, ఇటువంటి తరుణంలో 2002లో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 వేల మంది విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, మరి ఆర్టీసీ ఉద్యోగులకు పింఛన్ సౌకర్యం లేదని, ఈ విషయంపై జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఏడేళ్లుగా అనేక కార్పొరేషన్ల వారికి, ఆర్టీసీ యాజమాన్యానికి వినతులు అందించామని తెలిపారు. కార్మికులకు పెన్షన్ కింద రూ.7500 ఇవ్వడంతో పాటు డీఏ, భార్య, భర్తలకు వైద్య సదుపాయం ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ఉపాధ్యక్షులు రాంచంద్రారెడ్డి, ఆర్.అంజయ్య, ఉపేందర్, సత్యనారాయణగౌడ్, ఎమ్మెస్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, స్వామిగౌడ్, ఆర్.సత్యారెడ్డి, కేఎస్ఎన్ చారి, బివి.రావు తదితరులు ఉన్నారు.




డైరీని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ పదవీ విరమణ ఉద్యోగులు

### మౌలిక వసతులు కల్పించాలి

**మానవపాడు:** వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల వసతి గృహాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు భోజనం నాణ్యమైనదిగా అందిస్తున్నారా..? లేదా అని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయాలన్నారు. వసతి గృహాల చుట్టూ పందులు స్వైరవిహారం చేస్తున్నాయని చేస్తున్నాయని, అపరిశుభ్ర వాతావరణంతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### మామిడి రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

**వీపనగండ్ల:** మామిడి తోటలను సాగు చేసిన రైతులు మామిడి చెట్లకు పూత రాక నిరాశతో ఉండగా.. వారం రోజులుగా పూత వస్తుండడంతో రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపు 8 వేల ఎకరాలలో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా డిసెంబర్ చివరి నాటికి కూడా చెట్లకు పూత రాలేదు. కానీ ఇప్పుడిప్పుడే 50 శాతం తోటలు పూత దశకు వస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవి సీజన్‌లో అయిన మామిడి మార్కెట్లను ఏర్పాటు చేయాలని అత్యధికంగా మామిడి తోటలను సాగు చేసే గోవర్ధనగిరి, వీపనగండ్ల, కల్వరాల, రంగవరం, గోపల్‌దిన్నె, సంగినేనిపల్లి గ్రామాల రైతులు కోరుతున్నారు.



### శిక్షణ కేంద్రాన్ని వినియోగించుకోవాలి

**మానవపాడు:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ఉన్న యోగా శిక్షణ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ అధికారి నాగరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రోజు ఉదయం గంటపాటు యోగా చేస్తే ఆరోగ్యానికి ఎంతో మేలని తెలిపారు. యోగాతో శరీరం ధృడంతో పాటు ఉల్లాసంగా ఉంటుందన్నారు. పలువురు విద్యార్థులు, యువకులు యోగా శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో అబ్దుల్ నబీ, సీనియర్ కరాటే మాస్టర్లు

**కొత్తకోట:** పట్టణంలోని భారతి విద్యామందిర్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్‌నబీ తెలిపారు. ఈ పోటీలకు దాదాపు 50 మంది విద్యార్థినులు పాల్గొనగా.. ప్రతిభ చూపిన వారికి బీవీఎం చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఏజాజ్‌అలీలు బెల్టులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులో విద్యార్థులు కరాటే శిక్షణ తీసుకోవడం ద్వారా శారీరక, మానసిక ధృఢత్వం ఏర్పడుతుందని, ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తుందన్నారు. ప్రతిభ కనబర్చి సర్టిఫికెట్లు పొందితే ప్రభుత్వ ఉద్యోగాల్లో 5శాతం వరకు రిజర్వేషన్ వర్తిస్తుందని తెలిపారు. భారతీయ విద్యా మందిర్ హైస్కూల్ బ్రాంచ్ మాస్టర్ ఇంతియాజ్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మాస్టర్స్ జాఫర్‌సాధిక్, జి.హరీశ్‌యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ మాస్టర్స్ ఇఫ్తార్ రఫీ ఖాద్రీ, వెంకటేష్, పృథ్వీరాజ్, మంజునాథ్, వర్ధ శివరాజ్, జి.పరమేష్, శంకర్, అరవిందచారి, అంజి, జాంగీర్, ఎండీ రియాజ్, కురుమూర్తియాదవ్ తదితరులు ఉన్నారు.

# ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ

**ఆత్మకూర్:** పట్టణంలోని రాజవీధిలో పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి నిర్వాహకులు ఆదివారం విరాళాలు సేకరించారు. వందల ఏళ్ల క్రితం నిర్మించిన పెద్దమ్మ గుడి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో పునర్నిర్మాణానికి స్థానికులు సిద్ధమయ్యారు. ఇందుకుగాను రూ.2 కోట్లు అవసరం అవతుండడంతో ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.6లక్షలు విరాళాల రూపంలో వసూలు అయ్యాయని, భక్తులు ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరుతున్నారు. జనవరి 18వ తేదీన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు గడ్డమీది శ్రీను, భరత్, బాలకృష్ణ, రవీందర్, బాలు, కురుమూర్తి, నాగేష్, గోపాల్, శివ, అరవింద్, చిన్న, అయ్యప్ప మాలధారులు, తదితరులు ఉన్నారు.

# శివాలయంలో మాస శివరాత్రి పూజలు

**కొత్తకోట రూరల్:** పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో వైరాలగుట్టపై వెలసిన శివాలయంలో ఆదివారం మాస శివరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం గ్రామానికి చెందిన సలుకుటి బీసిరెడ్డి దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పూజల్లో మన్నెపురెడ్డి, ఎల్లారెడ్డి, రవిచందర్‌రావు, రాఘవేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆలయ కమిటీ ఎన్నిక**

గ్రామ పరిధిలోని ఆలయాల అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణ కోసం గ్రామ పెద్దల సమక్షంలో ఆలయ కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా నాగేంద్రం సాగర్, ప్రధాన కార్యదర్శిగా యాదవరెడ్డి, కోశాధికారిగా లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా లక్ష్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, గౌరవ సలహదారులుగా మన్నెపురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

# ప్రత్యేక తరగతులతో అవస్థలు

- ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం
- విద్యార్థులకు అందని స్నాక్స్
- చీకటి పడుతుండటంతో సమస్యలు

**ఉండవెల్లి:** పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రోజు సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సమయానికి బస్సులు రాక, చీకటి పడటం, సాయంత్రం వేళలో స్నాక్స్ కూడా అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు.



ఉండవెల్లిలో పదోతరగతి గదిలో విద్యార్థులు(ఫైల్)

**మారుమూల ప్రాంతాలకు ప్రయాణం..**

మండలంలో 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగ, ఇందులో 210 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఉండవెల్లి, బొంకూరు, తక్కశీల, బైరాపురం, పుల్లూరు బాలుర, బాలికల పాఠశాలలకు మారుమూల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. ఉండవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కంచుపాడు, చిన్న ఆముదాలపాడు, మారమునగాల, ప్రాగటూరు, గ్రామాల విద్యార్థులు ప్రైవేటు వాహనంలో ప్రయాణిస్తున్నారు. తక్కశీల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రాగటూరు, శేరుపల్లె, మారమునగాల–1,2 గ్రామాల ప్రజలు తక్కశీల గ్రామానికి వస్తున్నారు. బొంకూరు గ్రామ పాఠశాలకు కలుగోట్ల, మెన్నిపాడు, ఏ.బూడిదపాడు గ్రామానికి చెందిన విద్యార్థులు వస్తుంటారు. బైరాపురం గ్రామ పాఠశాలకు బస్వాపురం పాఠశాలకు చెందిన విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు.

**ప్రైవేటు వాహనాల్లోనే..**

ఆయా గ్రామాల విద్యార్థులు సైకిళ్లు, ఆటోలు, నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నారు. పాఠశాల సమయాలకు బస్సులు రాకపోవడంతో ప్రైవేటు వాహనాల్లోనే ప్రయాణిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు రోజు సాయంత్రం 4: 15 నుంచి 5:15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఉదయం 8: 30 గంటలకు వచ్చి సాయంత్రం 6 గంటల తర్వాత ఇళ్లకు చేరుకుంటున్నారు. ప్రస్తుతం తొందరగా చీకటి కావడంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు.

**రవాణా భత్యం లేదు..**

గ్రామీణ ప్రాంత విద్యార్థులు మూడు కిలో మీటర్ల దూరం ఉన్న ప్రభుత్వం పాఠశాలలో చదువుకుంటే గత ప్రభుత్వం రవాణ భత్యం ఇచ్చేది. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున ఏడాదికి రూ.6000 ప్రభుత్వం మంజూరు చేసేది. 2019లో గ్రామీణ విద్యార్థులకు రవాణా భత్యం ఇచ్చి రద్దు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఉన్నతాధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



నడుచుకుటూ వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)

**పస్తులు ఉంటున్నాం..**

ఉదయం 9 గంటలకే పాఠశాలకు వస్తున్నాం. ఇంటికి వెళ్లేందుకు రోజు సాయంత్రం 6 గంటలు దాటుతోంది. పాఠశాలలో స్నాక్స్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు పడుతున్నాం. ఆకలితో నీరసించి ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలి.

– మౌనిక, పదో తరగతి, ఉండవెల్లి జెడ్పీ పాఠశాల

**రవాణా ఛార్జీలు ఇవ్వాలి..**

ఇతర గ్రామాల్లో చదువుకునేందుకు రవాణా సౌకర్యం లేదు. కొన్ని గ్రామాలకు అసలు ఆర్డీనరీ బస్సులు రావడం లేదు. ప్రైవేటు వాహనాల్లోనే వెళ్లాల్సి వస్తోంది. ఛార్జీలు భారమవుతున్నాయి. పేద విద్యార్థులకు ప్రభుత్వం రవాణా చార్జీలు మంజూరు చేయాలి.

– శ్రావణి, పదో తరగతి

# వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- రేపటి నుంచి ఐదు రోజుల పాటు పూజలు
- మల్లాపురం గ్రామానికి వేలాదిగా తరలిరానున్న భక్తులు

**ఆత్మకూర్:** పట్టణ శివారులోని మల్లాపురం క్షేత్రంలో ఈనెల 31 నుంచి జనవరి 5, 2025 వరకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రముఖ వేదపండితుడు వెంకటశేషశర్మ తెలిపారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు వేలాదిగా భక్తులు హాజరవుతారన్నారు. 31న ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఆత్మకూర్‌లో గ్రామోత్సవం, జనవరి 1న దేవత ఆవనం, విశ్వక్సేన, పుణ్యాహావాచం, అంకురార్పణ, కళశస్థాపన, దిక్పాలకపూజ, గణపతి హోమం, 2వ తేదీన స్వామివారికి అష్టోత్తర కళశాలతో మహాస్నానం, అర్చన, నత్యహోమం, 3వ తేదీన సుదర్శణ హోమం, లక్ష్మీహోమం, గుడాజ్యోతి, మహిళా భక్తులచే శ్రీలక్ష్మీనారసింహస్వామి వారికి అభిషేకం, వేదపారాయణం, 4వ తేదీన స్వామివారికి కల్యాణోత్సవం, రథోత్సవం, 5వ తేదీన చక్రస్నానం, సుబ్రమణ్య, అయ్యప్ప మూర్తులకు అభిషేకం, పుష్పయాగం, మంగళశాసనం, ధ్వజావరోహణ, స్వస్తి వాచకం, కర్తలకు శేషవస్త్రాలతో వేదాశీస్సులు తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని, తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.



స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు